# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపిబీ) సమావేశంలో పెట్టుబడులపై చర్చిస్తోన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక అటవీకరణ కార్యక్రమాలు మరింత విస్తరించాలని అధికారులకు సూచించిన ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్**

3. **రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.**

4. **దేశంలో సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి –ఎస్ఐపీబీ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అనంతరం మధ్యాహ్నం మత్స్యశాఖ, ఆక్వా రంగం పొగాకు పంటకు సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పెట్టుబడులు, పారిశ్రామిక రంగాల ప్రస్తుత పరిస్థితులు, రైతులు, మత్స్యకారుల సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించనున్నారని అధికారులు తెలిపారు.

-------------------------

రాష్ట్రంలోని కోస్తా తీర ప్రాంతాల్లో గ్రీన్ బెల్ట్ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ అంశాలపై ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీరప్రాంతాల్లో హరిత వలయాల విస్తరణ, సామాజిక అడవుల పెంపకం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. గ్రీన్ బెల్ట్ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక అటవీకరణ కార్యక్రమాలను మరింత విస్తరించే అవకాశాలపై సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి, అటవీ సంపద పెంపుతో పాటు తీరప్రాంతాల్లో వృక్ష సంపద అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, హరితాంధ్ర

లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

--------------------------

రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈ రోజు మలేషియా చేరుకున్నారు. కౌలాలంపూర్‌లోని భారత రాయబార కార్యాలయంలో అధికారులు మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మలేషియా ప్రజాప్రతినిధులతో నారాయణ సమావేశమయ్యారు. అనంతరం సెలంగార్‌లోని వ్యర్థాల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని సందర్శించిన మంత్రి, ఘన వ్యర్థాల నిర్వహణపై మలేషియా అధికారులు ఇచ్చిన ప్రజెంటేషన్‌ను పరిశీలించారు. అలాగే ఇళ్లతో పాటు పరిశ్రమల నుంచి వచ్చే ఘన వ్యర్థాల నిర్వహణలో అనుసరిస్తున్న విధానాలను తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం బయోమెడికల్, పారిశ్రామిక పౌల్ట్రీ వ్యర్థాల నిర్వహణ కేంద్రాల పనితీరును పరిశీలించనున్నారు.

--------------------------

రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ రోజు విడుదలైయ్యాయి. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 39% ఉత్తీర్ణత సాధించగా.. ద్వితీయ సంవత్సరంలో 56శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. విద్యార్థులు తమ ఫలితాలను resultsbie.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా 9552300009 నంబర్‌కు వాట్సాప్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

--------------------------

ఉభయ గోదావరి జిల్లాలకు ముఖ్యమైన ధవళేశ్వరం ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలోని ధవళేశ్వరం ప్రాజెక్టును మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా కొత్త గేట్ల ఏర్పాటు, మరమ్మతు పనుల కోసం 150 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు. ధవళేశ్వరం ప్రాజెక్టు ఆధునికీకరణతో పాటు రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల పునరుద్ధరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

--------------------------

చేనేత కార్మికులు, కళాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయి చేనేత పురస్కారాలను ప్రవేశపెట్టాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాసిన మంత్రి, చేనేత రంగం రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, చీరాల, పెడన, పొందూరు, శ్రీకాళహస్తి, బొబ్బిలి, భట్టిప్రోలు, మదనపల్లె ప్రాంతాల చేనేత ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని గుర్తు చేశారు.కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జాతీయ చేనేత పురస్కారాల తరహాలో ప్రతి రాష్ట్ర స్థాయి పురస్కారాలను ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రదానం చేస్తే చేనేత కార్మికులు, డిజైనర్లు, కళాకారులకు ప్రోత్సాహంగా ఉంటుందని తెలిపారు.

--------------------------

వికసిత్ ప్రయాణంలో సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా దేశాభివృద్ధితో పాటు వారసత్వ పరిరక్షణను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని ఈ రోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. "వారసత్వంతో పాటు అభివృద్ధి" అనే దార్శనికతతో కేంద్ర ప్రభుత్వం దేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చారిత్రక సంపదను సంరక్షిస్తూనే వాటిని దేశ అభివృద్ధికి పునాదులుగా మలచే దిశగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పురందేశ్వరి అన్నారు.

---------------------------

రాష్ట్రంలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఎస్.ఐ.ఆర్ పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తుందని ఆలూరు శాసన సభ్యులు బి.విరుపాక్షి అన్నారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలోని పలు గ్రామాల బూత్ స్థాయి ఏజెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ స్థాయి ఏజెంట్ల పాత్ర కీలకమని అన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి, ఏవైనా అభ్యంతరాలు కనిపిస్తే వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని బీఎల్ఏలకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

---------------------------

ఆటిస్టిక్ ప్రైడ్ డేను ప్రతి సంవత్సరం జూన్ 18వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఆటిస్టిక్ వ్యక్తుల ప్రాముఖ్యతను గుర్తిస్తూ.. సమాజంలో వారి పట్ల సానుకూల దృక్పథాన్ని తీసుకు రావడమే ఈ వేడుక లక్ష్యం. ఆటిజం అనేది ఒక వ్యాధి కాదని.. అది ఒక రుగ్మత మాత్రమే అన్న విషయాన్ని తెలియపరచడం కోసం ప్రత్యేకంగా ఈరోజును ఆటిస్టిక్ ప్రైడ్ డేగా నిర్వహిస్తున్నారు. ఆటిస్టిక్ ప్రైడ్ డేను మొదటిసారిగా 2005లో యాస్పైస్ ఫర్ ఫ్రీడమ్ అనే సంస్థ బ్రెజిల్‌లో ప్రారంభించింది. ఆటిజం గురించిన అపోహలు తొలగించడమే లక్ష్యంగా ఈరోజు పలు కార్యక్రమాలు చేపడతారు. ఆటిజం గురించి సమాచారాన్ని అందరికీ తెలియచేసే విధంగా కార్యశాలలు, సమావేశాలు నిర్వహిస్తారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 135వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 26వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారం, మెరుగైన పౌర సేవల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని జగ్గయ్య పేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేటలోని పలు ప్రాంతాల్లో ఆయన ఈరోజు పర్యటించారు.

======================